# సర్దుబాటు

అక్కపెద్ది వెంకటేశ్వర శర్మ

ఆ ఉత్తరం చదివినప్పటి నుంచీ విష్ణుమూర్తి మనసు కుతకుతలాడిపోతోంది. ఆవేశంతో నరాలు నిటారుగా సాగి తెనతెన మంటున్నాయి. ఏదో చేసేయాలనే ఉద్రేకంతో శరీరం కంపించిం పోతోంది.

డామ్...ఎంత ధైర్యం? తన నో కోన్ కిస్కా గాడి కింద జమకట్టి పారేసింది! తన అతి మంచి తనాన్ని చేతకాని తనంగానూ, తన సాధు స్వభావాన్ని పిరికి తనంగానూ ఊహించుకుని ఉంటుంది. హు. తన ఆవేశానికి తనే నిలువెల్లా వణికి పోతున్నాడు.

అన లా ఉత్తరాన్ని మధ్యాహ్నం దాకా తను చదవనే లేదు. లంచ్ అవర్లో కాఫీకి డబ్బులివ్వాలని చొక్కా జేబులోంచి రూపాయి నోటు తీస్తుంటే చేతికి వచ్చిం దా ఉత్తరం!

"విష్ణూ!" అన్న నంబోధన చూసి ఆశ్చర్యంతో గబగబా విప్పి చదివా డా ఉత్తరాన్ని! తనకు తెలియకుండానే తన చొక్కా జేబులోకి వచ్చేసింది-భారతి రాసిన ఆ లెటర్, అంటే తను చదవాలనే వచ్చేముందు జేబులో పెట్టి ఉంటుంది.


కాంటీన్‌లో ఓ మూలగా కూర్చుని మళ్ళీ చదివాడు.

"విష్ణూ!"

లోకంలో అందరు మగాళ్ళ కంటే నువు భిన్నంగా ఉంటా వనుకుని ప్రేమించి మరీ పెళ్ళి చేనుకున్నాను. కానీ కానీ నిన్న రాత్రి .. ఛీ ఐ హేట్ యూ! నా బాధ, నా మాటలూ విన్పించుకోనే లేదు. అందుకే నువ్వంటే నాకు ఒళ్ళు మండి పోతోంది.

"అనలు నిన్ను గురించి నేను గాలి మేడలు కట్టుకున్నానని అనిపిస్తోంది ఆలోచిస్తూంటే. లేకపోతే చిలకా గోరింక ల్లాంటి మన చిన్న జీవితంలోకి పానకంలో పుడకలాగా కాలేజీ చదువు పేరు చెప్పి మీ చెల్లెల్ని తెచ్చి ఉంచుతానంటావా? నాదైన ఓ చిన్న ఇల్లూ-దాంట్లో నువ్వూ నేనూ-తీయని అనుభవాలూ ఈ మధురోహని నాలుగు నెలల్లోనే నువ్వు తుడిచేశావు. మీ చెల్లెలూ, అమ్మగారూ...ఇంకా మీ వల్లెటూళ్ళో ఉన్న గొడ్డూ, గోదా అన్నీ తెచ్చి ఇల్లంతా 'పశువుల నంత'ని చేనుకో-నాకు అభ్యంతరం లేదు. ఈ విశాల ప్రపంచంలో నా బ్రతుకు నేను బ్రతక లేక పోను. ఆ పైన నీ ఇష్టం. కానీ రాత్రి కనీసం భార్యాగా నా మాటైనా వినకుండా, నెల్లాళ్ళ తరువాత మా అన్నయ్య పెళ్ళి నించి రాగానే నీ ప్రవర్తన నన్ను మానసికంగా కూడా హింసించింది. నీకు పెళ్ళాం ఆడది-నీ వాళ్ళ అవసరాలు తీర్చే వంటలక్క. అంతేగా? ఆ లైఫ్‌ని నేను అసహ్యించుకుంటాను. ఆలోచించుకో-

"భారతి"




ఒకటికి పదిసా ర్లు చదివాడా ఉత్తరాన్ని. తననీ, తనవాళ్ళ ఉనికినీ పశువుల నంతగా మార్చేసిన భారతిని పశువులా బెల్టు పుచ్చుకు బాదాలని పించింది. 'గెటౌట్' అని మెడబట్టి బయటకితోసేయాలనిపించినది. ఇంకా చాలా ఇలాంటివే ఆలోచన్లు వచ్చాయి.

బలవంతాన నిగ్రహించుకుని పాన్‌షాప్ దగ్గర ఓ సిగరెట్ కొని వక్కనే వేలాడుతున్న కొబ్బరి తాడుతో ముట్టించు కుంటూంటే నంతోష్‌రావు ఎదురొచ్చాడు.

నంతోష్ రావుని అందరూ 'నలహాల నంతోష్‌రావ్' అంటారు. పెళ్ళాం వక్కింటి కంట్రాక్టర్ కొడుకుతో లేచి పోయిన తరువాత గానీ నంతోష్ రావ్‌కి దాంపత్య దీపాన్ని ఎలా ఆరి పోకుండా కాపాడుకోవాలీ అన్న ప్రశ్న ఉదయించలేదు. అందుక్కారణం ఉదయాన్ని చూడని తాగుబోతు కావడమే. పెళ్ళాంతో వెళ్ళిన కంట్రాక్టరు కొడుకు ఆర్నెల్లకి ఒక్కడే తిరిగొచ్చాక నంతోష్ రావు జీవితాల లోతును న్టడీ చేశాడు. ఆరేళ్ళ పాటు ప్రపంచంలోని అన్ని మానసిక శాస్త్ర గ్రంథాల్నీ చదివి "నంసారాన్ని ఎలా సుఖంగా చేయాలీ?" అనే పుస్తకం రాశాడు. అది పూతరేకులా చకచకా అమ్ముడై పోయాక నంతోష్ రావ్ ఉచిత నలహా్రలావ్‌గా మారిపోయాడు.

ఎప్పుడూ నరదాకైనా సిగరెట్ తాగని విష్ణుమూర్తి చేతిలో చకచకా సాగే కలం బదులు 'ఫిల్టర్ సిగరెట్' కనిపించే నరికి నంతోష్రావ్‌కి 'ఏదో ఫ్లాష్ వెలిగింది.

"ఏం గురూ, సిగరెట్‌ని కాష్టంలా తగ లేస్తున్నావ్?" వరా మర్శించాడు. విష్ణుమూర్తికి ఆ క్షణంలో ఎవరు ఎదురొచ్చినా తన్నేయాలన్నంత ఇదిగా ఉంది.

"మనను బాగా లేదు" అనేసి గిరుక్కున తన సెక్షన్ వైపు కదిలాడు.

ఆఫీస్ వదిలాక 'తాజ్' లో కాఫీ తాగేసి మళ్ళీ చదివా డా ఉత్తరాన్ని! ఎలా? తన అహంభావాన్నీ తన సుపీరియారిటీ కాంప్లెక్స్‌నీ భరించడం ఎలా? అనలు తనేం చేశాడని?

రాత్రి జరిగింది గుర్తొచ్చింది. తమ పెళ్ళయిన మూడు నెలలకే అమెరికా వెళ్ళి పోతున్న భారతీ వాళ్ళ అన్నయ్య పెళ్ళికుదిరింది హఠాత్తుగా. నెలరోజులు ముందు గానే వెళ్తానని గునిసి మారాం చేసి ఎలానో తన పర్మిషన్ కొట్టేసి భారతి ఆ పెళ్ళికి వెళ్ళి పోయింది.

నెల రోజులు! లాంగ్ పీరియడ్ ఆఫ్ థర్టీ డేస్ అండ్ సెవెన్ హండ్రెడ్ అండ్ ట్వంటీ అవర్స్ ప్రతిగంటకీ అరవై నిముషాలు - ప్రతీ నిముషానికీ అరవై సెకన్లు.

'విరహం' అనే ఈ బాధ తన ఒక్కడిదేనా? పెళ్ళికి రెండే రోజులు సెలవు దొరికితే వెళ్ళి వచ్చేశాడు. అంతే!

అలాంటిది-నిన్న రాత్రి నరదాగా, నరనంగా గడపాల్సింది పోయి 'మీ చెల్లెల్ని రమ్మని లెటర్‌రాశారా? మీ అమ్మ గారెందుకు వచ్చి

వెళ్ళారయా? నా కిష్టం లేదు ఇక్కడ ఉంచుకోవటం 'చెవిలో జోరీగలా ఒకటే రొద. తను మాత్రం ఏ మన్నాడని? ముద్దు ముద్దుగా-'నోరు మూయవే భామామణీ ప్రపంచంలో ఏ ఉపద్రవంలాంటి టాపిక్‌నైనా ఈ రాత్రి గడిచాకే డిస్కస్ చేసేది'-అన్నాడు.

"నథింగ్ డూయింగ్. మీరా సంగతి తేలిస్తే గానీ మీ దగ్గరకి రాను" అని దానికీ దీనికీ లంకె పెడుతుందా? తనలోని మగవాడి అహాన్ని రెచ్చ గొట్టింది. రెండు చేతుల్నీ బిగించి చుట్టేసి "ఈ నడుం నా సొంతం నీ ఇష్టాయిష్టాలు జాంతా నై..." అన్నాడు సరదాగా.

అంత మాత్రానికే రెచ్చి పోయింది. తను భారతి నుంచి సెక్స్ తప్ప ఏదీ ఆశించలేదట. నోటి కొచ్చినట్టు అంది. తనలోనూ విచక్షణ నశించింది. బలవంతంగా...

సెక్స్ ... డైనేమ్ ఈజ్ లవ్ ... మారిటల్ రిలేషన్స్ .. కాదూ-అనిఎంత సెంటి మెంటల్‌గా ఊహించినా నెలరోజుల విరహాన్ని తను అలా దెబ్బకొడితే ... మగవాడిగా తను ఎలా సహించి భరించగలడు?

'డామ్' మరోసారి కసిగా అనుకున్నాడు విష్ణుమూర్తి. 'విన్నూ' అని ప్రేమగా పిలిచే ఆ నోటికి తను తప్ప తన వాళ్ళు అక్కర లేదు. కానీ ఇంటికి పెద్ద కొడుకుగా నాన్న గారు పోయాక తను ఆ బాధ్యతను నెత్తిన వేసుకోకుండా ఎలా దాటేయ గలడు? ఇంటర్ పాసై డిగ్రీ కొచ్చిన చెల్లెలు పల్లెటూళ్ళో డిగ్రీ కాలేజీ లేక తమతో బాటే ఉండిచదువుకుంటానంటే ఎలా కాదనగలడు? 'వద్దే అమ్మడూ, నువ్వు మా కు కంట్లో నలుసువి - చెప్పులో రాయివి' అని ఎలా తరిమేయగలడు? అస లీ ఆడాళ్ళకు ఒంటి పక్షుల్లా బ్రతకడం మీద ఇంత మోజెందుకు?

ఆలోచిస్తున్న విష్ణుమూర్తికి ఇప్పుడేం చేయాలా అన్న సందేహం వచ్చింది. మనసులో సంతోష్‌రావ్ మెదిలాడు. క్షణం ఆలస్యం చేయకుండా కోఠీ వెళ్ళే బస్సెక్కాడు.

సంతోష్ 'రావ్' సోఫాలో కూచుని సిగరెట్ తాగుతూ తెల్ల కాగితాల్ని నలుపు చేస్తున్నాడు.

"రావోయ్ రా! పొద్దున్నే అనుకున్నాను. ఇవాళ నిన్ను మళ్ళీ చూస్తానని" అన్నాడు ఆహ్వానిస్తూ.

బిడియంగా తలొంచుకు కూర్చున్నాడు విష్ణుమూర్తి. ఫ్లాస్క్‌లో కాఫీని కప్పులోకి వంచి, అందించి అన్నాడు.

"ఆ ఇప్పుడు చెప్పు - నీ చేతిలోకి ఫిల్టర్ సిగరెట్ ఎందుకొచ్చింది?"

కాఫీ తాగుతూ జరిగిందంతా చెప్పాడు.

అంతా విన్నాక నిట్టూరుస్తూ "నే నీసారి రాస్తున్న పుస్తకం పేరు "కూలి పోయే కాపురాలూ - కూల్చే కారణాలూ" కానీ విష్ణుమూర్తీ నీ కో సందేహం రావచ్చు. ప్రపంచానికి సలహాలినిచ్చే ఈ సంతోష్ రావు తన సంసారాన్ని ఎందుకు బాగు చేసుకోలేక పోయాడు అని. యామై రైట్? 'ప్రతి మగవాడి వెనక ఓ ఆడది ఉంటుంది. 'అనే సూక్తి నూటికి నూరు పాళ్ళూ నిజం. మా ఆవిడ ఉన్నంత కాలం నాకు దాంపత్యం అంటే బెడ్డూ - ఫుడ్డూ మాత్రమే. కానీ అది లేచి పోయాక నాలో 'దీపం' వెలిగింది. నీకే కాదు. నీలాంటి వేల మంది సమస్యల కొకటే పరిష్కారం..."

చెప్ప మన్నట్లు చూశాడు విష్ణుమూర్తి.

"చచ్చే దాకా ఉండేది పెళ్ళాం మాత్రమే. తమ్ముడికి ఉద్యోగం వస్తే చెల్లి పెళ్ళయితే, తల్లీ తండ్రీ టపా కట్టేస్తే - ఒంటరి మనిషికి సహారా



లాంటిది పెళ్ళామే. కాబట్టి పెళ్ళాం మనను కష్టపెట్టకు"

"నాన్సెన్స్! దాని కోర్కెలు ...హెల్! అది నన్నే కీలుబొమ్మలా వాడుకోవాలను కుంటోంది"

"నాన్సెన్సయినా గోనె సంచయినా ఫరవాలేదు. మొగుడు కీలుబొమ్మ అయితే పెళ్ళాం తోలు బొమ్మ. పెళ్ళయిన కొత్తల్లోనే నీ భార్యకీ నీకూ మధ్య అగాథాన్ని పెంచుకోవడం వివేకం కాదు."

"అంటే నా వాళ్ళకి అన్యాయం చేయనా?"

సిగరెట్‌ని యాష్ ట్రేలో దులిపి గుంభనగా నవ్వాడు సంతోష్ రావ్.

"చూడు మూర్తీ ఆడదాని కంటే మగాడు పదేళ్ళయినా పెద్దాడయి ఉండాలనే వాళ్ళు పూర్వం. ఎందుకంటావ్? చెప్పలేవ్లే. లౌక్యం తెలియడానికయ్యా. అవిడ 'త్రై' అంటే నువ్వు 'క్రై' మంటే సంసారం చట్టు బండలవుతుంది."

"ఈ సోదంతా ఆపి నేనేం చేయాలో చెప్పండి స్వామీ" అన్నాడు విష్ణుమూర్తి చిరాగ్గా సిగరెట్ డబ్బీ అందుకోబోతూ.

టక్కున దాన్ని లాక్కుని "నెంబర్ వన్.. పెళ్ళాం మీది కోపంతో లేని దురలవాట్లు చేసుకోకూడదు" అన్నాడు.

సరిగ్గా ఐదునిముషాలయ్యాక "మీ చెల్లెలు తన దగ్గర వద్దు అందీ అంటే ఒక మనిషి ఖర్చు అదనం అనేది ఒక పాయింటైతే, మీ ప్రైవెసీకి అడ్డు అనేది రెండోది. కాబట్టి అర్జెంటుగ ఇప్పుడున్న ఒంటి అద్దె గదిలోంచి ఓ యాభై ఎక్కువైనా ఓ రెండు గదులున్న ఇంట్లోకి మారిపో. పాయింట్ నెంబర్ త్రీ. అన్నిటినీ మించి నిన్నటి నీ ఆటంబాంబ్ తాలూకు మంటలు చల్లా రాలంటే ఓ తారక మంత్రం ఉపదేశిస్తాను. చెవిని ఇలా తే" అని రెండే రెండు మాటలు చెప్పాడు.

నగం నచ్చీ నగంనచ్చని స్థితిలోనేబయటికొచ్చేడు విష్ణుమూర్తి!

*** *** ***

ఇంటి కెళ్తూనే చొక్కా విప్పి కొంకీకి తగిలించి "భార్యామణీ" అని పిలిచాడు. కోపం తగ్గని కోమలాంగి పక్క దిగనే లేదు. సరేమ్మని బాత్‌రూంలోకి దూరాడు. ముఖం కడుక్కొచ్చి "కాఫీ" అన్నాడు.

"టేబుల్ మీదుంది" ముక్తసరిగా జవాబిచ్చింది భారతి. గటగటా తాగేసి మళ్ళీ చొక్కా వేసుకుని "ఏనుండి బయట కెళ్తున్నాను" గాల్లోకి చెప్పి బయట పడ్డాడు.

అక్టోబరు చివరి రోజులు. చిరుచలి సన్నగా శరీరాన్ని స్పృశిస్తోంది. వీధి దీపం దగ్గర నిలబడి ఆత్రంగా చొక్కా జేబు తడిమి చూశాడు. చదివాక, సంతోష్‌రావ్ చెప్పినట్లు మడతల్లో కూడా తేడా రానీకుండా తను అసలు చదవనే లేదనట్లు జేబులోనే ఉంచిన "షాక్ లెటర్" లేదు!

"థాంక్స్ గురూ!" అనుకుని పూల దుకాణం వైపు నడిచాడు.

తిరిగి వచ్చేసరికి కంచాలు సద్దుతోంది భారతి. పూల పొట్లాన్ని మాట్లాడకుండా అందించాడు. అంతకంటే నిశ్శబ్దంగా తీసుకుని తల్లో తురుముకుంది.

కాళ్ళు కడుక్కుంటూ అప్రయత్నంగానే చెత్త బకెట్‌వైపు చూశాడు. "ష్టా" ఓ అక్షరం ఉన్న కాగితం ముక్క. అలాగే కొన్ని వందల చిన్న చిన్న తుంపులు.. చిరిగిన ఉత్తరంలో భాగాలు!

నవ్వుకుని లోపలి కొచ్చాడు.

కంచంలో తనకిష్టమైన గుత్తి వంకాయ వేపుడు! తను బజార్నుంచి వంకాయలు తేలేదే అనుకుని 'ఏదో గుర్తుకొచ్చి మళ్ళీ నవ్వుకున్నాడు.

భోజనం దగ్గరకూడా మౌనం కట్ట తెగలేదు. నిండుగా ప్రవహిస్తూనే ఉంది.

తరువాత పళ్ళెంలో తాంబూలం. నమిలాక పెదాలు పండాక పంటింటి పని అయ్యాక కట్టుకున్న పాత చీర స్థానే తెల్ల చీర కనబడింది. మంచం మీద పాత దుప్పటి స్థానే కొత్త బెడ్‌షీట్.

ఇంకా వరద తగ్గని మౌనపు వర్షమే!

వెళ్ళి పడుకున్నాడు, ఓ మూలగా బెడ్ లైట్ పెట్టి ట్యూబ్ ఆర్పేసింది. టేప్ రికార్డర్‌ని సన్నగా 'రూంసౌండ్' గా ఆన్‌చేసింది.

"టిక్..టిక్..టిక్.."పాట వస్తోంది.

ఒకళ్ళ భావం ఒకళ్ళకి అర్థం అవుతోంది. ఒకళ్ళ పిలుపులు ఒకళ్ళని అందిపుచ్చు కొమ్మంటున్నాయి. చేయి చాస్తే అందేంత దూరం!

ఇద్దరి మధ్యా స్ప్లిట్ సెకెండ్ ... ఒక్క క్షణపు ఆలోచన శూన్యమైతే ఓ జీవిత కాలం పాటు ఎడబాటు!

గాజులు కావాలనే శబ్దం చేశాయి. విష్ణు కాలు అప్రయత్నంగానే భారతి పాదాన్ని ఢీ కొంది!

ఒక్క క్షణం ఎందుకో విష్ణుమూర్తి కి సంతోష్‌రావ్ మాటలు గుర్తొచ్చాయి. "చదవలేదన్నట్టుగా నువ్వూ.. ఆయన చదవనే లేదని తనూ. ఇలా ఎన్ని రంగాలు దాటక పోతే జీవిత నాటకం రంజుగా సాగుతుంది."

మెల్లిగా చెయ్యి చాపి టేప్ రికార్డర్‌ని ఆఫ్ చేశాడు విష్ణుమూర్తి. అంతకంటే నిశ్శబ్దంగా చేతి కందేంత దూరంలో ఉన్న బెడ్ లైట్‌ని నిద్ర పోమంది భారతి! చిక్కనైన ఆ చీకట్లో సద్దుకున్న 'దాంపత్య దీపం' నిలిచి వెలుగుతోంది! ●

## మినీకథ శుభాకాంక్షలు

దామెర్ల రమాప్రభ

**1987** లోనే ప్రమోషన్ కొట్టెయ్యాలని ఓ బుట్టెడు పళ్ళు కొనుక్కుని సూర్యోదయానికి మునుపే ఆఫీసర్ ఇంటికి వెళ్ళాడు సుబ్బారావు. తలుపు తట్టగానే అప్పుడే తలస్నానం చేసి వచ్చిన ముసలాయన తలుపు తీశాడు.

"నమస్కారం, సార్! మాఆఫీసర్ గార్కి దసరా శుభాకాంక్షలు చెపుదామని వచ్చాను." పళ్ళికిలించాడు సుబ్బారావు.

"ఏ ఁ!" తలాడించాడు ముసలాయన అర్థంగాక.

"మీ అబ్బాయి గారికి నేనంటే చాలా ఇష్టమండీ!" మళ్ళీ పళ్ళన్నీ చూపించాడు.

"మాఅబ్బాయికా?" ఆశ్చర్యంగా అడిగా డాయన.

"మాఆఫీసర్ గారు మీ అబ్బాయే కదండీ! చూడగానే కనబడుతుందిగా, అంతా అదే పోలిక. ఒకే ఒక తేడా హిః హిః!" ఈసారి గట్టిగా నవ్వాడు సుబ్బారావు.

"వాట్ ఆర్ యూ టాకింగ్!" కోపంగా అడిగా డాయన.

సుబ్బారావు అదేం గమనించకుండా చెప్పుకుపోతున్నాడు తన ధోరణిలో— "మీకు విరబూసిన మల్లెపూల్లాంటి తెల్ల జుట్టు. మీ అబ్బాయికి- అదే మాఆఫీసరుకి నిగనిగ మెరిసే నల్లని జుట్టు. చక్కని పలువరస!" ఇంకా ఏదో చెప్పబోతున్న సుబ్బారావు ముసలాయన ముఖం చూసి టక్కున ఆపేశాడు.

ముసలాయన ముఖం కందగడ్డలా పెట్టుకుని సుబ్బారావునే మింగే సేటట్లు చూస్తున్నాడు.

'మధ్యలో ఈయన కెందుకింత కోపం!' మనసులోనే తిట్టుకుంటూ "సార్, మీ అబ్బాయిని పిలుస్తారా!" ఎలాగో అన్నాడు గొంతు పెగల్చుకుని.

"యూ గెటవుట్!" మెడ పట్టి గెంటినంత పని చేశాడు ముసలాయన.

"ఇదేంటయ్యా, వాచ్‌మెనూ! మాఆఫీసర్ను చూద్దామంటే వదలడేంటీ ముసలాయన?" మెల్లగా వాచ్‌మెన్ దగ్గర చేరాడు సుబ్బారావు.

"ముసలాయ నెవరండీ! మీ రిప్పుడు మాట్లాడింది మీ ఆఫీసర్ గారితోనే. ఇప్పుడే స్నానం చేసి వచ్చారులా ఉంది. ఇంకా రంగు వేసుకోలేదు. కట్టుడు పళ్ళు పెట్టుకోలేదు!" వాచ్‌మన్ జవాబు. ★

